## క్లుప్తంగా

### 'ప్రజా సమస్యలపై నిలదీస్తే కేసులా?'


సమావేశంలో మాట్లాడుతున్న సిరాజొద్దీన్ తదితరులు

మోమిన్‌పేట: వికారాబాద్ మండల కోఆప్షన్ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎర్రవల్లి జాఫర్‌పై అక్రమంగా పెట్టిన కేసును ఎత్తి వేయాలని ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిరాజొద్దీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఓ ప్రజాప్రతినిధిగా ప్రజా సమస్యలపై నిలదీస్తే అక్రమంగా కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉద్దేశ పూర్వకంగానే వికారాబాద్ తహసీల్దార్ సోమవారం జాఫర్‌పై కేసు పెట్టారని ఆరోపిస్తూ.. వెంటనే కేసును ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తహసీల్ కార్యాలయం ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్‌గౌడ్, మాణయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఎజాస్ పటేల్, సురేందర్, నర్సింహులు, హాజీ, అస్లం, హాశం, బాబా, ముజ్జు, నదీం తదితరులు ఉన్నారు.

### బాధితుడికి పరామర్శ

దోమ: ఆర్థిక ఇబ్బందులతో కొద్ది రోజుల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఏర్పుల శ్రీనుని అన్ని విధాల ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్ కుమార్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితున్ని మంగళవారం ఆయన పరామర్శించి, వైద్య ఖర్చుల నిమిత్తం బాధితుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు.

### హమ్మయ్య నీటి సమస్య తీరింది


నల్లాలను వినియోగించుకుంటున్న విద్యార్థులు

బొంరాస్‌పేట: 'మనఊరు–మనబడి' కార్యక్రమంలో భాగంగా దుద్యాల మండల కేంద్రంలోని సీపీఎస్ పాఠశాలలో తాగునీటి నల్లాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్న భోజనం సమయంలో చేతులు, ప్లేట్లు శుభ్రం చేసుకోవడానికి వీలుగా, నీరు తాగడానికి 10 నల్లాలు ఏర్పాటు చేయడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తంచేశారు. బోరునుంచి నీరు సరఫరా కావడంతో నీటి సమస్య తీరిందని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పల్లె కాశప్ప, విద్యార్థులు చెప్పారు.

### మహిళా కండక్టర్లకు సన్మానం


ప్రశంసా పత్రాలతో కండక్టర్లు

అనంతగిరి: వికారాబాద్ ఆర్టీసీ డిపోలో మంగళవారం మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిగి డీఎం పవిత్ర పాల్గొని మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళా కండక్టర్లు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈడబ్లుసీ సభ్యురాలు పద్మ, సెక్యూరిటీ ఇన్‌చార్జి నరేందర్‌రెడ్డి, పలువురు మహిళా కండక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న గిరిజన ఉద్యోగులు

అనంతగిరి: తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం 2023 డైరీని మంగళవారం వికారాబాద్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పాండునాయక్, ప్రధాన కార్యదర్శి నేనావత్ రవికుమార్, నారాయణ రాథోడ్, బాబుసింగ్, సురేందర్, హరిశ్చందర్, బాలు, గోపాల్, ప్రకాష్, తుకారం, రాజు, ప్రేంసింగ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.


తాండూరు టౌన్: గాంధీనగర్‌లో మహిళలు..


యాలాల: మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో..


వికారాబాద్: కలెక్టరేట్‌లో కుటుంబ సభ్యులతో కలెక్టర్


పరిగిలో.. జెడ్పీటీసీ హరిప్రియ తదితరులు

# ఘనంగా హోలీ

హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. చిన్నపెద్దా, పేద, ధనిక, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఇలా సకల జనులు రంగుల్లో మునిగితేలారు. సహజసిద్ధమైన సప్తవర్ణాలను పులుముకుంటూ కేరింతలు కొట్టారు. 'హోలీ హోలీల రంగ హోలీ చమ్మకేళీల హోలీ' అంటూ ఆటపాటలతో అట్టహాసంగా జరుపుకొన్నారు. ఉట్లుకొడుతూ రెట్టించిన ఉత్సాహంతో ఉర్రూతలూగారు. – సాక్షి, నెట్‌వర్క్


తాండూరు టౌన్: ఉట్టి కొట్టేందుకు యత్నిస్తున్న యువకులు


కొడంగల్: రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతున్న పిల్లలు, పెద్దలు


బొంరాస్‌పేట: వడిచర్లలో..


కుల్కచర్ల: ఇప్పాయిపల్లిలో చిన్నారులు


మోమిన్‌పేట: ఏన్కతలలో ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు


పెద్దేముల్‌లో..


మర్పల్లి: పట్లూరులో..


దోమలో..


అనంతగిరి: శివాజీనగర్‌లో.. కౌన్సిలర్ శ్రీదేవి తదితరులు


బంట్వారం: కోట్‌పల్లిలో..


అనంతగిరి: ఎమ్మెల్యేలు ఆనంద్, యాదయ్య

# వైభవోపేతంగా బ్రహ్మోత్సవాలు


స్వామి వారికి ఊంజల్ సేవలు నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు

దోమ: మైలారం శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. మొదటి రోజు స్వామి వారికి పుణ్యాహవాచనం, రక్షాబంధన్, వాస్తుపూజ, హోమాలు, అంకురార్పణ నిర్వహించగా.. రెండో రోజు మంగళవారం ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠ హోమం, విష్ణుసహస్రనామ పారాయణం, ఊంజల్‌సేవలను ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. బుధవారం(నేడు) సుప్రభాతం, సహస్రనామార్చన, విశేశ అభిషేకాలు జరుగు తాయని అర్చకులు, ఆలయ కర్త రాములు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారి తీర్థప్రసాదాలు తీసుకోవాలని కోరారు.

# మన సంస్కృతిని పరిరక్షించుకోవాలి


పాంబండపై గిరిప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నేతలు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ప్రహ్లాదరావు

కుల్కచర్ల: మన సంస్కృతి, సాంప్రదాయాలను మనమే పరిరక్షించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు, పాంబండ ఆలయ చైర్మన్ రాములు అన్నారు. మంగళవారం బండవెల్కిచర్ల పాంబండ దేవస్థాన క్షేత్రగిరి ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు పాటిస్తూ.. ఆలయాల విశిష్టతను మరింతగా పెంచేందుకే పాంబండ గిరి ప్రదర్శన అని తెలిపారు. నేటి యువతకు దేశ ఔనత్యం, చరిత్ర, చారిత్రక నేపథ్యం తెలియదని, వారికి వాటి గురించి తెలియ చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గిరి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య, ఆలయ పూజారి దశరథం, మైపాల్, గోపాల్ రెడ్డి, రాఘవేందర్, చెన్నయ్య, సంజీవ్, చంద్రలింగం, నర్సింహారెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కుల్కచర్ల: ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్‌ఐ గిరి అన్నారు. సోమవారం రాత్రి ఘనపూర్‌లో పోలీసు కళాజాత ఆధ్వర్యంలో పోలీస్ చట్టాలు, ప్రజాస్వామ్యం, యువత నడుచుకోవాల్సిన విధానాలు, నేరాలు అందుకు విధించే శిక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలలతో పనిచేయించుకోవడం, బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అంతే కాకుండా ఆవేశం, అనాలోచనతో యువత తప్పులు చేస్తూ.. ఇబ్బందులకు గురౌతున్నారని, కావున ప్రతి ఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాట్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్, స్థానిక నేతలు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### కార్మికుల అభ్యున్నతికి పోరాటం

పరిగి: జాతీయ భవన నిర్మాణ కార్మికుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉప్పరి కృష్ణయ్యను రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. నగరంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మంచన్‌పల్లి గ్రామానికి చెందిన కృష్ణయ్య, రేగడిమామిడిపల్లికి చెందిన కిష్టయ్యను ఉపాధ్యక్షుడిగా కమిటీ నియమించింది. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల అభ్యున్నతికి తాను నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. కార్మికులకు ఎక్కడ ఏ సమస్య వచ్చినా.. కమిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్మికుల అభ్యున్నతికి, సమస్యలపై నిత్యం పోరాటం చేస్తామని చెప్పారు.

# టీడీపీకి పూర్వ వైభవం ఖాయం


రొంపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న సుభాష్‌యాదవ్

- బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం
- సీఎం కేసీఆర్‌ను గద్దె దించుతాం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు సుభాష్‌యాదవ్

బంట్వారం: తెలుగు దేశం పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయమని, బూత్ స్థాయి నుంచి బలోపేతం చేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గూడెపు సుభాష్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని రొంపల్లి, కొత్తపల్లిలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసమే టీడీపీ పుట్టిందని తెలిపారు. నాడు రూ.2 కే కిలో బియ్యం పథకంతో ఎన్టీఆర్ పేదల కడుపు నింపారని ఆయన చెప్పారు. నేడు ధరల నియంత్రణ అదుపు లేకపోవడంతో సామాన్యుల బతుకు భారంగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. సీఎం కేసీఆర్‌ను గద్దె దించితేనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని, ధనిక రాష్ట్రానికి రూ. ఐదు లక్షల కోట్లు అప్పు మిగిలిందని ఆయన దుయ్యబట్టారు. ఎనిమిదేళ్ల పాలనలో కల్వకుంట్ల కుటుంబం లక్ష కోట్ల రూపాయలు దోచుకుందని ఆరోపిస్తూ.. టీడీపీ అధికారంలోకి రాగానే అంతా కక్కిస్తామన్నారు. అవినీతి సొమ్మును పంచేందుకు మళ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడించాలన్నారు. ఎన్నికల హామీలపై ప్రజలకు శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి పబ్బె దివాకర్, బంట్వారం మండల అధ్యక్షుడు నర్సింహులు, నాయకులు శేఖర్‌యాదవ్, నర్సింహారెడ్డి, పాండు, ప్రేమ్‌కుమార్, పాపిరెడ్డి, లింగయ్యగౌడ్, అన్వర్, జగన్, ప్రభు, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన సంపదే 'భీమ్' లక్ష్యం


కొడంగల్: వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

స్వేరో నెట్‌వర్క్ అధ్యక్షుడు శ్రీనివాస్

బొంరాస్‌పేట: కుల, మత రహితంగా యువకులు, బాల బాలికల్లో విజ్ఞాన సంపదే లక్ష్యంగా 'భీమ్ దీక్ష' చేపట్టామని స్వేరో నెట్‌వర్క్ అధ్యక్షుడు లక్నాపూర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట, కొడంగల్, దౌల్తాబాద్, మద్దూరు మండలాల్లో భీమ్‌దీక్ష కరపత్రాలు, గోడపత్రిక ఆవిష్కరించారు. తుంకిమెట్ల, రేగడిమైలారం గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ ఈనెల 15న పరిగి పట్టణ కేంద్రం టీచర్స్ కాలనీ ఎస్వీ గార్డెన్‌లో భీమ్ దీక్ష ప్రారంభిస్తున్నామని చెప్పారు. అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం అనే నినాదంతో పనిచేస్తున్న స్వేరో సంఘాలు.. చదువు ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులు, యువకుల్లో ఉన్నత చదువుల కోసం దీక్ష పూనేలా సంకల్పాన్ని పెంపొందిస్తామని చెప్పారు. దీక్షలో అనేక కార్యక్రమాలు ఉంటాయని, ముగింపు కార్యక్రమం ఏప్రిల్ 16న సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మైత్రి గ్రౌండ్ కమిటీలో ఉంటుందని ఆయన వెల్లడించారు. దీక్ష ప్రారంభోత్సవానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఐఏఎస్ అధికారి ఆకునూరు మురళీ తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. స్వేరో సర్కిల్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకటయ్య, శ్రీనివాస్, అంజిలయ్య పాల్గొన్నారు.

**కొడంగల్‌లో..**

కొడంగల్: ఈ నెల 15న పరిగి పట్టణంలో ప్రారంభించే 'భీమ్ దీక్ష' వాల్ పోస్టర్‌ను అంబేడ్కర్ చౌరస్తాలో ఆవిష్కరించారు. స్వేరో ఇంటర్నేషనల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్నాపూర్ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరన్‌పల్లి శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు తదితరులు మాట్లాడుతూ అక్షరం, ఆరోగ్యం, ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా దీక్ష చేపట్టామని తెలిపారు. కాన్సీరామ్ జయంతి నుంచి అంబేడ్కర్ జయంతి వరకు పవిత్రమాసంగా భావిస్తున్నట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో బుచ్చయ్య, సాయిలు, అనంతయ్య, ముకుంద్, హన్మంతు పాల్గొన్నారు.

# జోరుగా రియల్ దందా

- పల్లెల్లో విస్తరిస్తున్న వెంచర్లు
- మాయమవుతున్న వ్యవసాయ భూములు
- ప్రాంతాలను బట్టి భూముల ధరలకు రెక్కలు
- అనుమతి లేకుండానే లేఅవుట్లు


ఓ వెంచర్‌లో హద్దురాళ్లను తొలగిస్తున్న అధికారులు(ఫైల్)

దౌల్తాబాద్: పల్లెల్లో స్థిరాస్తి వ్యాపారం జోరుమీదుంది. ఓ వైపు వెంచర్లు వెలుస్తుండగా.. మరో వైపు వ్యవసాయ భూములు మాయమవుతున్నాయి. రియల్ వ్యాపారులు రైతుల నుంచి వ్యవసాయ భూములను కొనుగోలు చేసి, ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే లేఅవుట్ వేసి, ప్లాట్లను విక్రయిస్తున్నారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పిడి చేసేందుకు రెవెన్యూ శాఖ నాలా కన్వర్షన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఒక ఎకరా విస్తీర్ణంలో లేఅవుట్ చేయాలంటే 10శాతం స్థలాన్ని బడి, గుడి, పార్కు కోసం విడిచిపెట్టాలి. 30అడుగుల వెడల్పుతో రోడ్లను నిర్మించాలి. అయితే పలువురు రియల్ వ్యాపారులు ఈ నిబంధనలు ఏవీ పట్టించుకోకుండా వ్యవసాయ భూములను ప్లాట్లుగా చేసి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు 5,6 గుంటలుగా చేసి వ్యవసాయ భూములుగానే రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు సమాచారం. ధరణిలోనూ కొందరు వ్యక్తులు ఇలాగే రిజిస్ట్రేషన్ చేసి రైతుబంధు పొందుతున్నట్లు సమాచారం.

**వ్యవసాయ భూములకు గిరాకీ**

వెంచర్లుగా మార్చేందుకు అనువుగా ఉన్న వ్యవసాయ భూములను రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో ఆ భూముల ధరలకు రెక్కలు వచ్చి.. ప్రాంతాన్ని బట్టి ఎకరం రూ.50 లక్షల నుంచి రూ.1.50 కోట్ల వరకు పలుకుతుండడం గమనార్హం. దౌల్తాబాద్ నుంచి కోస్గి, మద్దూరు రోడ్డు వెంబడి ఉన్న భూములకు మంచి గిరాకీ ఏర్పడగా.. ప్లాట్ల ధరలు అదే రేంజిలో ఉన్నాయి. ఒక్కో వెంచర్‌లో గజం భూమి రూ.5 నుంచి 10వేల వరకు పలుకుతోంది. మండల కేంద్రంలో రూ.8వేల వరకు ఉండటం గమనార్హం.

**నిబంధనలకు తూట్లు..**

మండలంలో ఏర్పాటు చేస్తున్న కొన్ని వెంచర్లకు తగిన అనుమతులు లేవని తెలుస్తోంది. కొందరు దరఖాస్తు చేసుకొని ఫర్మిషన్ లేకుండానే పనులు ప్రారంభించారు. అయితే స్థానిక పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓ వెంచర్లలోని హద్దు రాళ్లను తొలగించారు. ఇక ముందు అనుమతులు లేకుండా ఎవరైనా వెంచర్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### అనుమతి లేకుంటే చర్యలు



అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే.. కఠిన చర్యలు తీసుకుంటున్నాము. ల్యాండ్ కన్వర్షన్ చేసుకున్నాక, అన్ని అనుమతులు వచ్చాకే వెంచర్లలో ప్లాట్లను విక్రయించాలి. గ్రామపంచాయతీకి గ్రీన్‌ఫీల్డ్ స్థలాన్ని అప్పగించాలి. అనుమతులు లేని పలు వెంచర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాం. కొనుగోలుదారులు అనుమతులు చూసుకోవాలి. – రవీందర్, ఎంపీఓ

### సీఐ ఆర్థికసాయం

అనంతగిరి: రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన వ్యక్తి కుటుంబానికి సీఐ శీను ఆర్థికసాయం చేసి మానవత్వం చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన నవాత్‌రెడ్డి ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ మంగళవారం తనవంతు సాయంగా రూ.5 వేలు అందజేశారు.